SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక



epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131



సంపుటి : 18 సంచిక : 268 ఎడిటర్ : విక్రం కుమార్ శుక్రవారం 06, జూన్ 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5


# తలపై తుపాకీ గురిపెట్టిన పాక్‌తో చర్చలుండవ్

## ఉగ్ర శక్తులను నియంత్రించకపోతే మళ్లీ దాడులు చేస్తాం: థరూర్



- **అమెరికా పర్యటనలో పలువురితో భారత బృందం భేటీ**

వాషింగ్టన్: తలపై తుపాకీ గురిపెట్టిన పాకిస్థాన్‌తో చర్చలు ఉండబోవని అమెరికాలో పర్యటిస్తున్న పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పష్టం చేశారు. తన భూభాగంలోని ఉగ్రవాద శక్తులను ఆ దేశం నియంత్రించకపోతే భారత్ ఇప్పటిలాగే మళ్లీ దాడులు చేస్తుందని హెచ్చరించారు. అమెరికా రాజధాని వాషింగ్టన్‌లోని క్యాపిటల్ హిల్‌లో పలువురు ప్రజాప్రతినిధులతో భారత బృందం భేటీ అయిన అనంతరం నేషనల్ ప్రెస్ క్లబ్‌లో థరూర్ మీడియాతో మాట్లాడారు. 'పాక్‌పై భారత్‌కు స్పష్టమైన వైఖరి ఉందని అమెరికా అర్థం చేసుకుందని నేను భావిస్తున్నా. పాక్‌తో భారత్ చర్చలు జరపదని కాదు. తలపై తుపాకీ గురిపెట్టి మాట్లాడే వ్యక్తులతో మేము సంభాషించం. అమెరికా అధ్యక్ష పదవిపై భారత దేశానికి అపారమైన గౌరవం ఉంది. కానీ దిల్లీ ఎప్పుడూ ప్రత్యేకంగా ఆపరేషన్ సిందూర్ విషయంలో ఎవరినీ మధ్యవర్తిత్వం చేయాలని కోరలేదు. ఎవరూ యుద్ధం ఆపాలని చెప్పాల్సిన అవసరం లేదు. పాక్ ఉగ్రవాద భాషను ఉపయోగించినంత కాలం.. మేము బల ప్రయోగ భాషను ఉపయోగిస్తాం.

తరువాయి 2లో



# పుడమిని... పరిరక్షించుకుందాం

- **పర్యావరణ దినోత్సవం సందర్భంగా మోదీ పిలుపు**
- **'సింధూర' మొక్క నాటిన ప్రధాని**

**జూన్ 05, సమయం న్యూస్ , దిల్లీ:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దిల్లీలోని తన అధికార నివాస ప్రాంగణంలో గురువారం 'సింధూర' మొక్కను నాటారు.

తరువాయి 2లో

# ఉద్యోగులకు రెండు డీఏలు





- **వెంటనే ఒకటి.. ఆర్నెల్ల తర్వాత మరొకటి**
- **నెలకు రూ. 700 కోట్ల చొప్పున బకాయిల చెల్లింపు**
- **ఉద్యోగి భాగస్వామ్య చెల్లింపుతో వైద్య చికిత్సలు**
- **సీఎస్ ఛైర్మన్‌గా ప్రత్యేక ట్రస్ట్**
- **మహిళా సంఘాల సభ్యులు మృతిచెందితే రూ. 10 లక్షలు**
- **హ్యామ్ విధానంలో రోడ్లకు పచ్చజెండా**
- **మెట్రో రెండోదశ విస్తరణకు ఆమోదం**
- **మంత్రిమండలి భేటీలో కీలక నిర్ణయాలు**

2లో

# ఆర్కైవ్స్‌పై విజిలెన్స్

- **రంగంలోకి నిఘా బృందాలు.. విచారణ ఆరంభం**
- **రాజ్యాభిలేఖ పరిశోధనాలయంలో వాంగ్మూలాల సేకరణ**

**జూన్ 05, సమయం న్యూస్, హైదరాబాద్:** తెలంగాణ స్టేట్ ఆర్కైవ్స్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (రాజ్యాభిలేఖ పరిశోధనాలయం)లో అక్రమ కార్యకలాపాలను నిగ్గు తేల్చడంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దృష్టి సారించింది. విచారణ కోసం అదనపు ఎస్పీ ఆనంద్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని నియమించింది. ఆర్కైవ్స్‌లోని విలువైన దస్త్రాలు

తరువాయి 2లో





# 'సీమ'కు పారిశ్రామిక హంగు

- **ఏడాదిలో రూ.1.59 లక్షల కోట్ల పెట్టుబడులు**
- **46 భారీ ప్రాజెక్టుల ఏర్పాటుకు అనుమతులు**
- **1.26 లక్షల మందికి ఉపాధి అవకాశాలు**
- **విద్యుత్ హబ్‌గా రూపాంతరం**
- **రక్షణ పరిశ్రమలతో ప్రపంచవ్యాప్త గుర్తింపు**

**జూన్ 05, సమయం న్యూస్ :** ఐదేళ్ల వైకాపా పాలన.. రాయలసీమను ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయింది. కొప్పర్తి నోడ్, కావాల్సినవారికి సౌర, పంప్డ్ స్టోరేజి విద్యుత్ ప్రాజెక్టుల కేటాయింపు మినహా.. సీమ గతిని మార్చేలా నిర్దిష్టమైన ప్రయత్నాలు చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాయలసీమ పారిశ్రామిక ప్రగతి దిశగా అడుగులు వేస్తోంది. ఏడాదిలోనే రూ.1.59 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రేపోమాపో కడప ఉక్కు పనులు మొదలు కాబోతున్నాయి. రక్షణరంగ పరిశ్రమలూ రానున్నాయి. కొప్పర్తి, ఓర్వకల్లు నోడ్‌ల అభివృద్ధికి కేంద్రం నిధులిచ్చింది. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో పారిశ్రామికవేత్తలను బెదిరించి రాష్ట్రం నుంచి తరిమేసింది. కూటమి ప్రభుత్వం మళ్లీ పారిశ్రామికాభివృద్ధి దిశగా ప్రయత్నాలు చేస్తోంది. భారీ పెట్టుబడులతో పరిశ్రమలు, పునరుత్పాదక ప్రాజెక్టులు, పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. ఏడాదిలోనే రూ.1,59,080

తరువాయి 2లో

# పొగాకు, మామిడి, కోకో రైతులకు ఊరట

- **నేటి నుంచి 7 మార్కెట్ యార్డుల్లో హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు**
- **ప్రాసెసింగ్ మామిడి రకాలకు కిలో రూ.12**
- **కోకో కిలో ధర రూ.500..**
- **సీఎం సమీక్షలో నిర్ణయం**



**జూన్ 05, సమయం న్యూస్, అమరావతి:** రాష్ట్రంలో ఏడు మార్కెట్ యార్డుల ద్వారా హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, పెదనందిపాడు, ప్రత్తిపాడు, చిలకలూరిపేట, మద్దిపాడు యార్డుల ద్వారా శుక్రవారం నుంచే సేకరణ ప్రారంభించనున్నారు. ఇక, ప్రాసెసింగ్ రకం మామిడికి కిలో రూ.12 చొప్పున చెల్లించి కొనుగోలు చేయాలని ఆహారశుద్ధి పరిశ్రమలు, ట్రేడర్లను ఆదేశించింది. ఇందులో వ్యాపారులు రూ.8, ప్రభుత్వం రూ.4 చొప్పున భరించాలని నిర్ణయించింది. కోకో రైతులకు కిలోకు రూ.500 దక్కేలా.. వ్యాపారులు రూ.450, ప్రభుత్వం రూ.50 చొప్పున చెల్లించనుంది.

తరువాయి 2లో

# ఉగ్రవాదుల ఆవాసాలపై ఎన్ఐఏ దాడులు

- **జమ్మూకశ్మీర్‌లోని 32 ప్రాంతాల్లో సోదాలు**

దిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని 32 ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) గురువారం సోదాలు నిర్వహించింది. ఉగ్రముఠాల ఆవాసాలు,

తరువాయి 2లో



# ఆర్కైవ్స్‌పై విజిలెన్స్

(మొదటిపేజీ తరువాయి)

బయటికి తీసుకురావడం, ఆ స్థానంలో నకిలీ పత్రాలను చొప్పించడంతోపాటు అవే అసలైనవంటూ రాజముద్ర వేసి మరీ ఇస్తూ భూఆక్రమణలకు, న్యాయవివాదాలకు కొందరు కారణమవుతున్న వైనంపై 'ఆర్కైవ్స్‌లో దొంగలు పడ్డారు!' శీర్షికన ఈ నెల 4న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనం కలకలం సృష్టించింది. హైదరాబాద్ శివార్లలోని విలువైన భూములను కొల్లగొట్టేందుకు కొన్ని ముఠాలు పన్నిన పన్నాగాలను ఆధార సహితంగా కథనంలో ప్రస్తావించిన నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ అంశంపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించింది. ఈ మేరకు రంగంలోకి దిగిన విజిలెన్స్ బృందం గురువారం ఉదయం 10 గంటలకే విచారణ ఆరంభించింది. ఆర్కైవ్స్ కార్యాలయం ప్రధాన ద్వారాన్ని మూసివేసి..పలువురు అధికారులు, సిబ్బంది వాంగ్మూలాలను సేకరించింది. సాయంత్రం పొద్దుపోయే వరకూ విచారణ కొనసాగింది.

**నకిలీ దస్త్రాల సేకరణలో నిమగ్నం**

పురాతన కాలం నాటి భూదస్త్రాలకు నిలయమైన ఆర్కైవ్స్ విభాగంలో నకిలీ దస్త్రాల దందాపై విజిలెన్స్ బృందం ప్రధానంగా దృష్టిసారించింది. ఆ విభాగంలోని సిబ్బంది సహకారంతో భూకబ్జాదారులు నకిలీ రికార్డులు సృష్టించిన అంశంపై కూపీ లాగుతోంది. ఇప్పటికే రాయదుర్గంలో 83 ఎకరాలు, మంచిరేవులలో 76 ఎకరాలు, యాచారంలో 10 ఎకరాల భూములకు సంబంధించి నకిలీ దస్త్రాలు సృష్టించినట్లు బహిర్గతం కావడంతో ఆయా రికార్డులను సేకరించడంలో నిమగ్నమైంది. నకిలీ దస్త్రాలు సృష్టించడంలో కీలకపాత్ర పోషించింది ఎవరు, వాటిని ఆర్కైవ్స్‌లోని సంబంధిత విభాగంలోకి ఎవరు చేర్చారు, అనంతరం స.హ.చట్టం దరఖాస్తు ద్వారా ఆ రికార్డులను ఎవరు పొందారు, దాని ఆధారంగా న్యాయవివాదం సృష్టించింది ఎవరు, ఈ ముఠాల వెనక ఉన్న సూత్రధారులెవరు, ఆయా ముఠాలకు సహకరించిన ఇంటిదొంగలు ఎందరున్నారు..తదితర వివరాలను సేకరించే దిశగా విజిలెన్స్ బృందం విచారణ కొనసాగిస్తోంది. ఆయా దస్త్రాలకు సంబంధించిన నోట్‌ఫైళ్లనూ పరిశీలిస్తోంది.

**కేసుల వివరాల కోసం లేఖలు**

నకిలీ దస్త్రాలపై ఇప్పటికే సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగంతోపాటు ఉస్మానియా యూనివర్సిటీ, నార్సింగి ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయా కేసుల తాలూకు వివరాలు ఇవ్వాలని కోరుతూ సంబంధిత ఠాణాలకు విజిలెన్స్ లేఖలు రాసింది.

# పుడమిని పరిరక్షించుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

''బంగ్లాదేశ్ విముక్తి కోసం పాకిస్థాన్‌తో భారత్ చేసిన యుద్ధంలో కచ్‌కు చెందిన వీరమహిళలు తమ పరాక్రమాలను ప్రదర్శించారు. ఇటీవల నేను గుజరాత్‌లో పర్యటించిన సమయంలో ఆ తల్లులు, సోదరీమణులు నన్ను కలిసి సిందూర మొక్కను బహుమతిగా ఇచ్చారు. ఈ రోజు ఆ మొక్కను ప్రధానమంత్రి నివాసంలో నాటే భాగ్యం నాకు లభించింది. ఈ మొక్క మన దేశ నారీశక్తి శౌర్యానికి, స్ఫూర్తికి ప్రతీక'' అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా పుడమిని రక్షించుకోవటానికి ప్రయత్నాలు ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కూడా పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలని 'ఎక్స్' వేదికగా సూచించారు.

**ఆరావళి హరిత ప్రాజెక్టు ప్రారంభం**

దిల్లీ నుంచి గుజరాత్ వరకు 700 కి.మీ. మేర విస్తరించిన ఆరావళి పర్వత ప్రాంతాలను హరితమయం చేసే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. గుజరాత్, రాజస్థాన్, హరియాణా, దిల్లీలను కలిపే ఆరావళి ప్రాంతం.. భూగోళం మీద పురాతనమైనవాటిలో ఒకటని 'ఎక్స్'లో పేర్కొన్నారు. దిల్లీలో విద్యుత్తు బస్సుల్ని ఆయన ప్రారంభించారు. భగవాన్ మహావీర్ వనస్థలి పార్కులో మొక్కను నాటారు.

# ఉగ్రవాదుల ఆవాసాలపై ఎన్ఐఏ దాడులు

(మొదటిపేజీ తరువాయి)

వారికి అంతర్గతంగా మద్దతునిస్తున్న వారి నివాస ప్రాంగణాలపై దాడులు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సోదాల్లో ఆయుధాలు, నేరాలకు సంబంధించిన పత్రాలు, డిజిటల్ పరికరాలను పెద్దమొత్తంలో స్వాధీనం చేసుకున్నట్లు ఎన్ఐఏ వెల్లడించింది. పుల్వామా, కుల్గాం, శోపియాన్, బారాముల్లా, కుప్వాడా జిల్లాల్లో పాకిస్థాన్ మద్దతుతో పనిచేస్తున్న ది రెసిస్టెంట్ ఫ్రంట్, యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ జమ్మూకశ్మీర్, ముజాహిద్దీన్ గజ్‌వాత్ ఉల్ హింద్, జమ్మూకశ్మీర్ ఫ్రీడమ్ ఫైటర్స్, కశ్మీర్ టైగర్స్ తదితర ఉగ్రసంస్థల కార్యకర్తలు, మద్దతుదారుల నివాసాలపై ఎన్ఐఏ దాడులు జరిపింది. ఇవన్నీ లష్కరే తయ్యిబా, జైషే మహ్మద్, అల్ బదర్ వంటి నిషేధిత ఉగ్రసంస్థలకు అనుబంధ సంస్థలుగా కొనసాగుతూ వాటి కుట్రలను అమలుపరుస్తున్నాయని ఎన్ఐఏ ఆరోపించింది.

# నేను లేకుంటే ట్రంప్ ఓడిపోయేవారే: మస్క్

**ఆయన లేకున్నా గెలిచేవాడినే: డొనాల్డ్**



వాషింగ్టన్: తన మద్దతు లేకుంటే 2024 అమెరికా ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్, రిపబ్లికన్ పార్టీ నేతలు ఓటమి పాలయ్యేవారని టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యాఖ్యానించారు. 'నేను లేకుంటే ట్రంప్ ఓడిపోయేవారు. ప్రతినిధుల సభపై డెమోక్రాట్లు ఆధిక్యం సాధించేవారు. సెనెట్‌లో రిపబ్లికన్లు 51 49తో ఉండేవారు' అని ఆయన గురువారం స్పష్టం చేశారు. రిపబ్లికన్ ట్యాక్స్ బిల్లును మస్క్ వ్యతిరేకించడంతో తాను అసంతృప్తికి గురయ్యానని, శ్వేతసౌధంలో తన స్నేహితుడు లేకపోవడం విచారకరమని ట్రంప్ అంతకుముందు వ్యాఖ్యానించారు. తాను ఎన్నికల్లో విజయం సాధించడానికి మస్క్ అవసరం లేదని స్పష్టం చేశారు. మస్క్ లేకుండానే పెన్సిల్వేనియాలో తాను గెలిచేవాడినని తెలిపారు. మస్క్ వ్యాపారాలకు ఉపయోగపడే ప్రభుత్వ కాంట్రాక్టులకు, రాయితీలకు కోత వేస్తానని ట్రంప్ హెచ్చరించారు. అదే సమయంలో మస్క్ వరుసగా ఎక్స్‌లో స్పందించారు. కొత్త పార్టీ పెట్టవచ్చా అని అభిమానులను ప్రశ్నించారు. '80శాతం మందికి ప్రాతినిధ్యం వహించేలా అమెరికాలో కొత్త పార్టీ పెట్టడానికి ఇది సమయమేనా..' అని అడిగారు.

# ఉద్యోగులకు రెండు డీఏలు

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మంత్రిమండలి శుభవార్త చెప్పింది. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలలో రెండింటిని చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆరోగ్య ట్రస్టు ఏర్పాటు చేయడానికి నిర్ణయంతీసుకుంది. ప్రతినెలా రూ.700 కోట్ల చొప్పున ఉద్యోగుల బకాయిలు చెల్లించేందుకు ఆమోదం తెలిపింది. స్వయం సహాయక బృందాల్లోని సభ్యులు చనిపోతే.. వారి కుటుంబాలకు నేరుగా ప్రభుత్వమే రూ.10 లక్షలు చెల్లించాలని నిర్ణయించింది. కొత్తగా 86.1 కి.మీ. మేర మూడు మార్గాల్లో మెట్రో నిర్మాణాన్ని రూ.19,579 కోట్లతో చేపట్టేందుకు ప్రభుత్వం ఆమోదించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సుమారు ఐదున్నర గంటల పాటు క్యాబినెట్ సమావేశం జరిగింది. స్వల్ప అస్వస్థత కారణంగా అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ ఈ సమావేశానికి హాజరు కాలేదు. మిగిలిన మంత్రులందరూ పాల్గొన్నారు. ఇందులో తీసుకున్న నిర్ణయాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, రెవెన్యూ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా విలేకరుల సమావేశంలో వెల్లడించారు. త్వరలో మరోసారి మంత్రివర్గం సమావేశమవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. క్యాబినెట్‌లో మొత్తం 70కి పైగా అంశాలపై చర్చించారు. ''మంత్రి మండలి సమావేశంలో ఉద్యోగులకు అనుకూలంగా సుదీర్ఘంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నాం. ఉద్యోగులను సొంత బిడ్డలుగా పరిగణిస్తూ నిర్ణయం తీసుకున్నందుకు సీఎంకు, మంత్రిమండలికి ధన్యవాదాలు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన క్యాబినెట్ సబ్‌కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించి అందులోని అంశాలకు ఆమోదం తెలిపాం. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు కష్టపడుతున్న ఉద్యోగుల యోగక్షేమాల కోసం, అవసరాలు తీర్చేలా నిర్ణయాలు తీసుకున్నాం. డీఏ కోసం ఉద్యోగ సంఘాలు ఎదురుచూస్తున్నాయి. ఉద్యోగుల డిమాండ్లపై మే 6న ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ తన నివేదికను సమర్పించింది. ఉద్యోగులు ఇచ్చిన 57 డిమాండ్లను పరిశీలించిన మంత్రివర్గం.. అధికారుల కమిటీ నివేదిక ప్రకారం కొన్ని అంశాలను ఆమోదించింది. మరికొన్నింటిని పరిశీలనకు స్వీకరించింది. ప్రభుత్వ ఖజానాపై పడే ఆర్థిక భారాన్ని లెక్కలు కట్టి ప్రస్తుతానికి రెండు డీఏలు చెల్లించాలని నిర్ణయించాం. 2023 జనవరి 1 నుంచి బకాయి ఉన్న డీఏల్లో ఒక డీఏను వెంటనే చెల్లిస్తాం. అప్పటి నుంచి బకాయి ఉన్న ఎరియర్స్‌ను 28 వాయిదాల్లో ఇస్తాం. మరో డీఏను ఆర్నెల్ల తర్వాత చెల్లించాలని క్యాబినెట్ నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం వారు నెలకు రూ.500 చొప్పున చందా చెల్లిస్తే.. దానికి సమాన వాటాను ప్రభుత్వం చెల్లించి.. ఆ మొత్తంతో ఆరోగ్య ట్రస్టును ఏర్పాటు చేస్తాం. ఈ ట్రస్ట్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా అధికారులు, ఉద్యోగులు సభ్యులుగా ఉంటారు. ఆరోగ్యపరమైన సమస్యలను ఈ ట్రస్టు ద్వారా పరిష్కరించే వెసులుబాటు కల్పిస్తాం.

*** ప్రాధాన్యక్రమంలో బకాయిల చెల్లింపు**

ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల బకాయిలు గత ప్రభుత్వం నుంచి మాకు వారసత్వంగా వచ్చాయి. ఈ బిల్లులను ప్రాధాన్యక్రమంలో ప్రతి నెలా రూ.700 కోట్లకు తగ్గకుండా చెల్లిస్తాం. సచివాలయంలో ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల కోటా 12.5 శాతానికి, ఉద్యోగుల మెడికల్ ఇన్‌వాలిడేషన్ కమిటీ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇక నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగులను తిరిగి తీసుకోకూడదన్న ప్రతిపాదనకు మంత్రిమండలి అంగీకరించింది. గ్రామపంచాయతీల గ్రేడింగ్ ప్రకారం కార్యదర్శులకు గ్రేడింగ్ ఇవ్వనున్నాం. డీపీసీ రెగ్యులర్‌గా నిర్వహించి, పదోన్నతులు వచ్చేలా నిర్ణయాలు చేశాం. ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఉద్యోగులను వెనక్కు తీసుకురావడంతో పాటు కారుణ్య నియామకాలన్నీ వేగంగా పూర్తిచేస్తాం. కొత్తగా నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటుకు మంత్రి మండలి నిర్ణయించింది. అంగన్‌వాడీలకు పదవీ విరమణ ప్రయోజనాలు పెంచేందుకు సానుకూలంగా నిర్ణయం తీసుకుంది. వారి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను రూ.2 లక్షలకు పెంచాలని తీర్మానించింది. ఉద్యోగుల అద్దె వాహనాల బిల్లులు వెంటనే చెల్లించడంతోపాటు అద్దె పెంచే విషయమై సానుకూలంగా నిర్ణయం తీసుకున్నాం. జాయింట్ స్టేట్ కౌన్సిల్, అసోసియేషన్లను గుర్తించడానికి ప్రభుత్వం అంగీకరించింది. జీవో 317లో ఇంకా కొన్ని కేటగిరీలను చేర్చాలని నిర్ణయించింది.

*** బీమా కింద రూ.38.5 కోట్లకు ఆమోదం**

భద్రాద్రి కొత్తగూడెంలోని ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరు పెట్టేందుకు మంత్రి మండలి తీర్మానం చేసింది. స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రమాదవశాత్తు చనిపోతే, వారికి రూ.10 లక్షల బీమా ఇచ్చే కార్యక్రమం ఉండేది. ఇకపై ఇన్సూరెన్స్ ద్వారా కాకుండా.. వారికి ప్రభుత్వమే నేరుగా రూ.10 లక్షలు చెల్లించాలని నిర్ణయించాం. గత ఏడాది 385 మంది చనిపోయారు. వారికి రూ.38.5 కోట్ల నిధులు చెల్లించేందుకు మంత్రిమండలి ఆమోదించింది. ఈ విధానాన్ని భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ రోడ్లు చాలా దుర్భర పరిస్థితుల్లో ఉన్నాయి. గతంలో పాలకులు వారి ఫాంహౌస్‌లకు అనుకూలంగా రోడ్లు వేసుకున్నారు. మా ప్రభుత్వం ప్రతి గ్రామంలో రోడ్లు, గ్రామాల నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్లు, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రెండు వరుసల రోడ్లు, జిల్లా కేంద్రం నుంచి రాజధానికి నాలుగు వరుసల రోడ్లు నిర్మించనున్నాం. ఆర్ అండ్ బీ కింద 5,190 కి.మీ, పంచాయతీరాజ్ కింద 7,947 కి.మీ రోడ్లు మొదటి విడతలో హ్యామ్ విధానంలో నిర్మిస్తాం. ఈ రోడ్లు రెండున్నరేళ్లలో నిర్మించి, 15 ఏళ్ల పాటు ఒకే ఏజెన్సీ నిర్వహణ చేపట్టేలా నిర్ణయం తీసుకున్నాం. రాజధానిని గ్రీన్ సిటీగా మార్చేందుకు మెట్రో రైలు మార్గాల విస్తరణ చేయనున్నాం.

# పొగాకు, మామిడి, కోకో రైతులకు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

పొగాకు, మామిడి, కోకో పంటలకు గిట్టుబాటు ధరలపై గురువారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు విలేకరులకు వివరించారు. గిట్టుబాటు ధరలతో కొనుగోలు చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై రూ.550 కోట్ల వరకు భారం పడుతుందన్నారు.

**సీఎం సమీక్షలోని ప్రధానాంశాలు**

హెచ్‌డీ బర్లీ పొగాకును ఐటీసీ, జీపీఐ సంస్థలు కలిపి 25 మిలియన్ కిలోలు, చిన్న కంపెనీలు 20 మిలియన్ కిలోల చొప్పున కొనాలి. రెండు, మూడు గ్రేడ్ల రకాలు కొనేలా కంపెనీలతో మాట్లాడాలి. ప్రధాన రకాన్ని క్వింటాలుకు రూ.12 వేలకు తగ్గకుండా సేకరించాలి. మిగతా రెండు రకాలకు పరిస్థితులను బట్టి ధర నిర్ణయిస్తాం. ఈ పొగాకు కొనుగోళ్లతో ప్రభుత్వంపై రూ.300350 కోట్ల భారం పడనుంది. ఈ ఏడాది చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో 5.5 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి ఉత్పత్తి వచ్చింది. ఇదంతా ప్రాసెసింగ్ రకం. ఇప్పటికే ప్రాసెసింగ్ సంస్థల వద్ద 43 వేల టన్నుల మామిడి గుజ్జు నిల్వలున్నాయి. పార్లే ఆగ్రో, కోకకోలా, పెప్సికో సంస్థల నుంచి ఆర్డర్లు రాకపోవడమే సమస్యకు కారణం. రైతులు, ట్రేడింగ్ కంపెనీలు, ప్రాసెసర్లను రిజిస్టర్ చేయాలి. రికార్డులు నిర్వహించాలి. కంపెనీలు కిలోకు రూ.8 ఇస్తే, ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నేరుగా కిలోకు రూ.4 చొప్పున జమ చేస్తుంది. ఇందుకు రూ.100150 కోట్ల వరకు భరించనుంది.

* రైతుల నుంచి ఇప్పటికే 465 టన్నుల కోకో కొనుగోలు చేశారు. ఇంకా 745 టన్నుల నిల్వలు రైతుల వద్దే ఉన్నాయి. కనీసం కిలోకు రూ.500 దక్కేలా చేసేందుకు ప్రభుత్వం కిలోకు రూ.50 చొప్పున చెల్లించనుంది. మొత్తం రూ.10.50 కోట్లు ఖర్చవుతుంది.
* రాష్ట్రంలో కోకో పాలసీ తీసుకురావాలి. నాణ్యత కలిగిన ఉత్పత్తులు వచ్చేలా రైతుల్ని చైతన్యపరచాలి.
* రైతుబజార్లను 116 నుంచి 200కు పెంచాలి. మొబైల్ మార్కెట్లు తీసుకురావాలి.
* పీఎం కిసాన్ డేటాకు అనుగుణంగా అన్నదాతా సుఖీభవ లబ్ధిదారుల జాబితా రూపొందించాలి.
* పామోలిన్‌పై దిగుమతి సుంకం తగ్గించడం వల్ల రైతులు ఎలా నష్టపోతున్నారో కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి. నిర్ణయం వెనక్కి తీసుకునేలా కేంద్రాన్ని ఒప్పించే బాధ్యతను కేంద్ర మంత్రులు, ఎంపీలు తీసుకోవాలి.
* ధరలు లేనప్పుడు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల్ని మళ్లించే బాధ్యత వ్యవసాయ శాఖదే.

# తలపై తుపాకీ గురిపెట్టిన పాక్‌తో చర్చలుండవ్

(మొదటిపేజీ తరువాయి)

కాల్పుల విరమణ కోసం మూడో పక్షం మధ్యవర్తిత్వం అవసరం లేదు' అని థరూర్ స్పష్టం చేశారు. పాకిస్థాన్ నేత బిలావల్ భుట్టో అమెరికాలో శాంతి వచనాలు పలకడంపై భాజపా ఎంపీ తేజస్వీ సూర్య అభ్యంతరం వ్యక్తం చేశారు. వారి నోటి నుంచి శాంతి వచనాలు రావడం చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందని ఎద్దేవా చేశారు. థరూర్‌తోపాటు ఆయన మీడియాతో మాట్లాడారు. 'నకిలీ హీరోలను తయారు చేసేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది. యుద్ధంలో విఫలమైన వారికి ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి కల్పించింది. వారికి నిజమైన హీరోలు ఎలా ఉంటారో తెలియదు. చైనాకు చెందిన చౌకైనా ఆయుధాలతో పాక్ నెట్టుకొస్తోంది. కాబట్టి మా దేశంలోని అత్యాధునిక ఆయుధాలు, మా బలగాలు, బలమైన ప్రజాస్వామ్య నాయకత్వాన్ని జీర్ణించుకోవడం వారికి కష్టమే' అని సూర్య పేర్కొన్నారు.

**జేడీ వాన్స్‌తో భేటీ**

అమెరికాలో పర్యటిస్తున్న భారత ప్రతినిధి బృందం.. గురువారం ఉపాధ్యక్షుడు జేడా వాన్స్‌తో భేటీ అయింది. ఆయనతో సమగ్ర చర్చలు జరిపింది. ఉగ్రవాదం, సాంకేతిక సహకారంపై వారి మధ్య చర్చలు జరిగాయి. అంతకుముందు బుధవారం క్యాపిటల్ హిల్‌లో పలువురు అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు, సెనేటర్లను భారత ప్రతినిధి బృందం కలిసింది. వారంతా ఉగ్రవాదంపై భారత పోరాటానికి సంఘీభావం తెలిపారని థరూర్ వెల్లడించారు. నీ భాజపా ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలోని బృందం.. బెల్జియంలోని బ్రస్సెల్స్‌లో ఐరోపా కూటమి (ఈయూ) నేతలతో భేటీ అయింది. యూరోపియన్ పార్లమెంటు ఆసియా ఇన్‌ఛార్జ్ ఉపాధ్యక్షుడు క్రిస్టెల్ షాల్డెమోస్‌ను కలిసిన బృందం.. ఆపరేషన్ సిందూర్, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ తీరు గురించి వివరించారు. ఈయూ పార్లమెంటు సభ్యులు, ప్రవాస భారతీయులతోనూ బృందం భేటీ అయింది.

*** జాతీయ ప్రయోజనాల కోసం పని చేయడం పార్టీకి వ్యతిరేకమా?**

జాతీయ ప్రయోజనాల కోసం పని చేయడం పార్టీకి వ్యతిరేకమన్నవారు.. వారిని వారే ప్రశ్నించుకోవాలని శశి థరూర్ స్పష్టం చేశారు. దేశం కోసం పని చేస్తున్నవారు ఇటువంటి విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. విదేశాలకు వెళ్లిన అఖిలపక్ష బృందానికి నాయకత్వం వహించే విషయంలో తమను సంప్రదించనందుకు కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు పార్టీ నేతలు విమర్శించిన నేపథ్యంలో ఆయన ఇలా స్పందించారు.

*** కుమారుడి ప్రశ్న.. తండ్రి సమాధానం**

కచ్చితమైన సాక్ష్యాలు లేకుండా భారత్ దాడులు చేయదని శశి థరూర్ స్పష్టం చేశారు. విదేశీ వ్యవహారాల కౌన్సిల్‌లో జరిగిన ముఖాముఖిలో ఓ జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ సమాధానమిచ్చారు. అయితే థరూర్‌కు ఈ ప్రశ్న వేసింది ఆయన కుమారుడే కావడం విశేషం. థరూర్ కుమారుడు ఇషాన్ థరూర్ వాషింగ్టన్ పోస్టులో కాలమిస్టుగా ఉన్నారు. 'మీరు పలు దేశాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మీతో సంభాషించిన వారెవరైనా.. ఉగ్ర దాడుల్లో పాకిస్థాన్ హస్తం ఉందనడానికి ఆధారాలను చూపాలని కోరారా.. దీంతోపాటు పదే పదే పాక్ మీ ఆరోపణలను తిరస్కరించడంపై మీరేమంటారు' అని ఇషాన్ ప్రశ్నించారు. దీనిపై శశి థరూర్ నవ్వుతూ స్పందించారు. 'ఇషాన్.. నువ్వు ఈ ప్రశ్న లేవనెత్తడం పట్ల సంతోషిస్తున్నా. దీనిని నేను ప్లాన్ చేయలేదు సుమా.. ఇషానే వాళ్ల నాన్నకు అడిగారు. మమ్మల్ని ఎవరూ ఆధారాలు కావాలని అడగలేదు. కానీ మీడియానే అడిగింది. మీ మీడియా తరఫున అడుగుతున్నావు. ఇంకో రెండు మూడు చోట్ల ఈ ప్రశ్న ఎదురైంది. అయితే కచ్చితమైన ఆధారాల్లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ భారత్ దాడి చేయదు' అని శశి థరూర్ స్పష్టం చేశారు.

# 'సీమ'కు పారిశ్రామిక హంగు

(మొదటిపేజీ తరువాయి)

కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. వాటి ఆధారంగా సుమారు 1,26,519 మంది యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని అంచనా. ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చి సరిపెట్టకుండా.. నిర్దేశిత వ్యవధిలో వాటిని పూర్తిచేసేలా పర్యవేక్షించేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసింది.

**ఇక వెలుగుల సీమ**

సీమ 'విద్యుత్ పుంత' కాబోతోంది. 27 భారీ సౌర, పవన, పంప్డ్ స్టోరేజి విద్యుత్ ప్రాజెక్టులు (పీఎస్‌పీ), బ్యాటరీ స్టోరేజి ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. 16వేల మెగావాట్లకు పైగా విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు కాబోతున్నాయి. వాటిద్వారా రూ.లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులు సీమ జిల్లాకు రాబోతున్నాయి. అవన్నీ పూర్తయితే విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల హబ్‌గా మారుతుంది.

**నడవాలకు.. పారిశ్రామిక కళ**

హైదరాబాద్‌బెంగళూరు పారిశ్రామిక నడవాలో ఓర్వకల్లు నోడ్‌ను రూ.2786.10 కోట్లతో అభివృద్ధి చేస్తోంది. ఇక్కడి పరిశ్రమల నీటి అవసరాలు తీర్చేందుకు రూ.200 కోట్లతో 57 కి.మీ. పైపులైన్ ఏర్పాటుచేస్తోంది. ఓర్వకల్లులో జపాన్‌కు చెందిన ఇటోయె మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, మన దేశానికి చెందిన హైడ్రెస్ గ్రూప్, బీఎన్ గ్రూప్‌లు సంయుక్తంగా రూ.14వేల కోట్లతో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమను నెలకొల్పనున్నాయి. దీనిద్వారా 2వేల మందికి ఉపాధి లభించనుంది. ఓర్వకల్లులో పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్ 1200ఎకరాల్లో రూ.13వేల కోట్ల పెట్టుబడితో 'ఈవీ పార్క్' ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రపంచంలో తొలి 'సమీకృత పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు'(ఐ.ఆర్.ఇ.పి.)ను రూ.24 వేల కోట్లతో గ్రీన్‌కో సంస్థ కర్నూలులో ఏర్పాటుచేస్తోంది. సౌర, పవన, పీఎస్‌పీ ప్రాజెక్టుల ద్వారా 6వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి వస్తుంది. విశాఖచెన్నై పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా కొప్పర్తి నోడ్‌ను రూ.2137 కోట్లతో అభివృద్ధి చేస్తారు.




సీతంపేట పట్టణం లో ఐటిడిఏ ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ నందు జరిగిన "ప్లాస్టిక్ నిర్మూలిద్దాం- పర్యావరణాన్ని కాపాడుకుందాం" అనే నినాదంతో జరిగిన పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గున్న పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ గారు, సీతంపేట ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ యశ్వంత్ కుమార్ రెడ్డి గారు మరియు వివిధ హోదాలో ఉన్న ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

: జూన్ 5, సీతంపేట, సమయం న్యూస్





సీతంపేట పట్టణం నందు ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ లో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, సీతంపేట ఐటిడిఏ PO యశ్వంత్ కుమార్ రెడ్డి మరియు వివిడి హోదాలో ఉన్న అధికారులు పాల్గొన్నారు.

: జూన్ 5, సీతంపేట, సమయం న్యూస్

# ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులు తీసుకోవద్దని పాఠశాలలా యాజమాన్యానికి విజ్ఞప్తి

* **అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్.**

అంబర్ పేట, జూన్, 4 (సమయం న్యూస్) : ఈ సందర్భంగా కార్పొరేటర్ పటేల్ నగర్ లోని తన కార్యాలయంలో మాట్లాడుతూ అంబర్ పెట్ డివిజన్ లో అనేకమంది పేద బడుగు బలహీన వర్గాల వారు అధికంగా ఉండడంతో, ప్రవేట్ పాఠశాలల యజమానులు విద్యార్థుల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తూ అధిక ఫీజులు తీసు కోకుండా మానవత్వ కోణంలో ఆలోచించాలని, ఫీజులు



నియంత్రణలో ఉండాలని,సకాలంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అంద జేయాలని తెలియజేశారు.



# యువతను పారిశ్రామికవేత్తలు చేయడమే కూటమి ప్రభుత్వం యొక్క ధ్యేయం

సమయం న్యూస్,సీతం పేట,జూన్ 5: ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం యువతను పారిశ్రామికవేత్తలు చేయాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో MSME పార్కులు అభివృద్ధి చేయాలని కృతనిత్యంతో ఉందని, దీనికి అనుగుణంగానే 175 నియోజకవర్గాల్లో స్థల సమీకరణ చేసి MSME పార్కు నిర్మాణ పనులను చేపడుతున్నట్లు ఎం.ఎస్ ఎం.ఇ. డెవలప్మెంట్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ తెలిపారు. గురువారం ఆయన పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గారిని ఆయన స్వగృహం రాజుపురంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పార్కులు ద్వారా గిరిజన యువతకు పూర్తిస్థాయి అవగాహన కల్పించి, ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు అందించి యువతను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలని తెలిపారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ నూతన పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇచ్చేలా కుటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పాలకొండ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. కొన్ని రోజుల్లోనే ముఖ్యంగా గిరిజన మరియు ఇతర నేపథ్య వర్గాలలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించడానికి యేర్పాట్లు చేస్తున్నామన్నారు. గిరిజన యువతను మరియు అన్ని వర్గాల యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ ఎంఎస్ఎంఈ పార్కులు దోహదపడతాయని, ప్రభుత్వం ద్వారా కూడా అన్ని విధాల వెసులుబాట్లు కల్పిస్తూ ఈ పార్కుల ద్వారా యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొండ పట్టణ జనసేన నాయకులు కొండదాడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ కాలుష్యం అంతం చేద్దాం...

: **కలెక్టర్ విజయేందిర బోయి**

* **ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మయూరి ఎకో పార్క్ వద్ద రహదారి వెంబడి అటవీ శాఖ అధికారి సత్యనారాయణ ఆద్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరివేత# పాల్గొన్న జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,అధికారులు, విద్యార్థులు**






మహబూబ్ నగర్ జూన్, 05 (సమయం న్యూస్) : పర్యావరణం, మానవాళి మనుగడకు హాని కలిగించే ప్లాస్టిక్ కాలుష్యం ను అంతం చేద్దాం అని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. నిత్య జీవితం లో ప్లాస్టిక్ వాడకం నిర్మూలించి పర్యావరణ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలని ఆమె అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మయూరి పార్క్ వద్ద రహదారి వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించే డ్రైవ్ లో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,జిల్లా అధికారులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్,అధికారులు,విద్యార్థులు మయూరి ఎకో పార్క్ వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరివేసే కార్యక్రమం లో పాల్గొని ప్లాస్టిక్ వ్యర్థాలు ట్రాక్టర్ లో వేయడం జరిగింది. ఈ సందర్భంగా మయూరి ఎకో పార్క్ లో నిర్వహించిన కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణం దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు ఈ సంవత్సరం ప్లాస్టిక్ ను జయిద్దాం అనే థీమ్ తో ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణానికి మానవ ఆరోగ్యం కు చాలా ప్రమాదకరమని, ప్లాస్టిక్ వినియోగం అంతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్లాస్టిక్ వాడటం వల్ల చాలా నష్టాలు ఉన్నాయని తెలిపారు. ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి, ఆహార భద్రతకు ముప్పు కలిగిస్తుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలోకి వెళ్ళడం వల్ల సముద్ర జీవులు మరణిస్తాయి, ఆహార గొలుసులో విషపదార్థాలు చేరతాయని, ప్లాస్టిక్ వస్తువులు కుళ్ళిపోవడానికి చాలా సమయం పడుతుంది, ప్లాస్టిక్ కణాలు మట్టి, నీరు, ఆహారంలోకి చేరి మానవులకు హాని కలిగిస్తాయని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, గాలిని కలుషితం చేస్తాయన్నారు. ఇది నేల యొక్క సారవంతతను తగ్గిస్తుంది, నీటి వనరులను కలుషితం చేస్తుందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ పారవేసేటప్పుడు వెలువడే గ్యాసులు వాతావరణ కాలుష్యానికి కారణమవుతాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్ర జీవులు తింటే అవి విషపూరితమవుతయనిని, మరణిస్తాయని అన్నారు. ప్లాస్టిక్ సముద్ర జీవుల ఆవాసాలను నాశనం చేస్తుందని అన్నారు. ప్లాస్టిక్ కణాలు మన ఆహారంలో మరియు నీటిలో చేరి మానవ ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని, ఇది క్యాన్సర్, హార్మోన్ల అసమతుల్యత ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని అన్నారు. ఆహార భద్రతకు ముప్పు: ప్లాస్టిక్ కాలుష్యం ఆహార వనరులను కలుషితం చేయడమే కాక ఆహార భద్రతకు ముప్పు కలిగిస్తుందని అన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణ వ్యవస్థల సామర్థ్యాన్ని తగ్గిస్తుందని అన్నారు. ప్లాస్టిక్ వాడకానన్ని ప్లాస్టిక్ సంచులు, బాటిళ్ళు, ఇతర ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. పునర్వినియోగం చేయదగిన వస్తువులను వాడాలని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సరిగ్గా పారవేసి,రీ సైకిల్ చేయాలని అన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కంకణబద్ధులు కావాలని పిలుపు నిచ్చారు ఒకసారి ఉపయోగించి పారవేసే తక్కువమందం గల సింగల్ యూస్ ప్లాస్టిక్ ను నిరోధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని ప్రజలు భాగస్వాములై ప్రభుత్వానికి సహకరించనాడే లక్ష్యాన్ని సాధిస్తామని అన్నారు. అనంతరం విద్యార్థులకు పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన,వకృత్వం,డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన వారికి మెమెంటో లు కలెక్టర్ అంద చేశారు. పర్యావరణ కాలుష్య మండలి ద్వారా జూట్ తో తయారు చేసిన బ్యాగ్ లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్చర్ల కు బి.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాల అధ్యాపకులు సదాశివయ్య స్నేక్ షో ను విద్యార్థులు తిలకించారు.

# సమస్యల పరిష్కార వేదికలుగా రెవెన్యూ సదస్సులు

* **కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**



నిజామాబాద్, జూన్ 05(సమయం న్యూస్): రెవెన్యూ సంబంధిత భూ సమస్యల పరిష్కారానికి భూభారతి రెవెన్యూ సదస్సులు వేదికలుగా నిలువాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హను మంతు అధికారులకు సూచించారు. రుద్రూర్ మండలం రాణంపల్లి, సాలూర మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులను కలెక్టర్ సందర్శించారు. అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిని ఆన్లైన్ లో నమోదు చేస్తున్నారా? అని అధికారులను ఆరా తీశారు. వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు అందించాలని, సంబంధిత రిజిస్టర్లలో వివరాలు రాయాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్‌డెస్క్ లను, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. సమస్యల వారీగా అర్జీలను విభజిస్తూ, పక్కాగా రికార్డులను పొందుపర్చాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. జూన్ 20వ తేదీ వరకు అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని, భూ సమస్యలున్న ప్రజలు ఈసదస్సులకు హాజరై దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. సదస్సులలో ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని, సానుకూలంగా ఉన్న సమస్యలను సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ఒకవేళ సమస్యను పరిష్కరించేందుకు నిబంధనలు అంగీకరించని పక్షంలో దరఖాస్తుదారుడికి ఆ విషయాన్ని స్పష్టంగా అర్థమయ్యే రీతిలో తెలియజేయాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తుదారులను పదేపదే తిప్పుకోకూడదని, సదస్సులో అర్జీలు అందించేందుకు వచ్చే వారితో సున్నితంగా వ్యవహరించాలని రెవెన్యూ బృందాలకు హితవు పలికారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ రెవెన్యూ సదస్సులు ముగిసిన మీదట క్షేత్రస్థాయిలో విచారణ జరపాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా చూడాలన్నారు. అర్హులైన వారికి పూర్తి న్యాయం జరిగేలా సానుకూల దృక్పథంతో పని చేయాలని, అప్పుడే భూభారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సార్థకత చేకూరి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# పారిశ్రామికవాడలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

* **న్యూ ల్యాండ్ పరిశ్రమ ఆధ్వర్యంలో కార్యక్రమాలు**

జిన్నారం, జూన్ 5, సమయం న్యూస్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను న్యూ ల్యాండ్ పరిశ్రమ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ సిబ్బంది ,కార్మికులు పర్యావరణ రక్షణ నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు .అనంతరం పరిశ్రమ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పరిశ్రమ యాజమాన్యం సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఒక్కొక్క మొక్కను నాటాలని పరిశ్రమలోని కార్మికులకు పిలుపునిచ్చారు ఇంటి ఆవరణలో పచ్చని చెట్లు ఉంటే ఇంట్లోని సభ్యులు ఆరోగ్యంగా ఉంటారని వారు వివరించారు ఈ కార్యక్రమంలో యాజమాన్య సిబ్బంది పరాక్ దేశముఖ్, కార్తికేయన్ కృష్ణస్వామి, శేఖర్ సుబ్బారి, రవి చిత్తులూరి, సిబ్బంది, కార్మికులు ,తదితరులు పాల్గొన్నారు.



epaper.samayamdaily.net
సమయం
మన గొంతుకే.. మన పత్రిక



# ఎరువుల అందుబాటులో ఉంచాలి

* **రైతులకు ఇబ్బంది చేస్తే కఠిన చర్యలు**
* **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్ జూన్05 (సమయం న్యూస్) : జిల్లాలో విస్తృతంగా పర్యటించి భూ భారతి రెవెన్యు సదస్సులు, విత్తన, షాపులు, ఎరువుల గోదాం లను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా. గురువారం అదిలాబాద్ రూరల్ అర్లీ బి, లాండా సాంగ్వి, మావల మండలం సరస్వతి నగర్ , చందటి, తంతోలి లలో రెవెన్యు సదస్సులు, విత్తన షాపులను. ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మొదటగా అదిలాబాద్ రూరల్ ఆర్లి బి గ్రామ పంచాయితీ లో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యు సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న తీరును పరిశీలించి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, గ్రామస్తులు దరఖాస్తులు ఏ సమస్య పై పెట్టుకున్నారు, ఎప్పటికప్పుడు రిజిస్టర్ లో నమోదు చేస్తున్నది, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రెవెన్యూ గ్రామాలలో జరుగుతున్న సదస్సులను పరిశీలించి, మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి భూ సమస్యలు పరిష్కారానికి రైతులకు సులభతరమైన విస్తృత సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన సదస్సులను జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలనీ, ఈ సదస్సులో సమస్యలు ఉన్న రైతులు, ప్రజలు వినియోగించుకోవాలనీ సూచించారు, ధరఖాస్తు కోసం వచ్చే వారికి కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు సమకూర్చాలని, హెల్ప్ డెస్క్ ద్వారా వారికి సహాయ సహకారాలు అందించాలని ఆన్నారు. రెండు బృందాలుగా రెవెన్యూ సిబ్బందిని నియమించి క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.





అనంతరం మావల మండలం సరస్వతి నగర్ ప్రాథమిక పాఠశాల లో ఏర్పాటు చేసిన రెవెన్యు సదస్సులు, అదిలాబాద్ గ్రామీణ తంతోలి లలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యు సదస్సులను సందర్శించి అధికారులు స్వీకరిస్తున్న దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించి పలు సూచనలు సలహాలు చేశారు. ఆర్లి బి లక్ష్మి ప్రసన్న ఫర్టిలైజర్ షాప్, బెల్లూరి శ్రీ బాలాజీ ఫెర్టిలైజర్స్ సీడ్స్ షాపు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం లో ఉన్న ఎరువులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువులు, రైతులకు విక్రయిస్తున్న తీరును, రిజిస్టర్ నిర్వహణ పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందనీ, మోసపూరితంగా విత్తనాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు పెట్టడం జరుగుతున్నదని స్పష్టం చేశారు. విత్తనాల సరఫరా, నాణ్యత, నియంత్రణ కోసం ప్రమాణాలు, ధరల పట్టికలు పరిశీలించారు. కలెక్టర్ వెంట తహిసిల్దార్ గోవింద్, మండల వ్యవసాయ అధికారి, తదితరులు ఉన్నారు.

# జనం సాక్షి పత్రిక సంపాదకుడు రెహమాన్ పై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలి

* **చిన్న మరియు మధ్యతరహా పత్రికల సంఘం డిమాండ్**

కాలుష్యాన్ని వెదజల్లుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో చెలరేగిన హింసకు బాధ్యుడిగా జనం సాక్షి పత్రిక సంపాదకుడు రెహమాన్ పై కేసు పెట్టడాన్ని చిన్న మరియు మధ్యతరహా పత్రికల సంఘం తీవ్రంగా ఖండించింది. ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు బిజిగిరి శ్రీనివాస్, సిరికొండ అగస్టీన్ లు ఒక ప్రకటనలో ఖండించారు. బాధ్యతాయుతమైన పత్రిక ఎడిటర్ పై అక్రమ కేసులు పెట్టడం అన్యాయమని పర్యావరణానికి, జల కాలుష్యానికి కారణమవుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, యాజమాన్యం ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు పై సమగ్ర విచారణ జరిపించి సంపాదకుడు రెహమాన్ పై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని వారు తమ ప్రకటనలో డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తమ ప్రకటనలో పేర్కొన్నారు




# ప్రపంచ పర్యావరణం జీవనాధారం

సంగారెడ్డి జూన్05( సమయం న్యూస్) : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జి.భవాని చంద్ర గారి ఆదేశాల ప్రకారం ఈరోజు కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి అదనపు జిల్లా జడ్జి శ్రీమతి కే జయంతి గారు ముఖ్య అతిథిగా విచ్చేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది మరియు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గౌరవ జడ్జి గారు మాట్లాడుతూ పర్యావరణం అంటే మన చుట్టూ ఉండే సహజ వాతావరణన్ని ఇందులో గాలి, నీరు, నేల, వృక్షాలు, జంతువులు, మానవుడిలా అన్ని అంశాలు కలిసి ఉంటాయని పర్యావరణం మనకు జీవనాధారం అని చెప్పొచ్చు ప్రతి జీవిత జీవనానికి అవసరమైన వనరులు ఈ పర్యావరణం ద్వారానే పొందుతారు ఈ కారణంగా పర్యావరణం ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకమైన ప్రాధాన్యతను సంపాదించింది ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటారు ఈరోజు పర్యావరణ పరిరక్షణకు సంబంధించి అవగాహన పెంచడం కోసం వివిధ దేశాలు సంస్థలు ప్రజల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి అని అన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని వర్షాకాలంలో మొక్కలు నాటి రాబోయే తరానికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన అవసరం మనపై ఉందన్నారు ఇప్పుడున్న పరిస్థితుల్లో అంతరించిపోతున్న అడవులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు మొక్కలను పెంచడంతో స్వచ్ఛమైన గాలి లభిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమం నందు మొదటి అదనపు జిల్లా శ్రీమతి కే జయంతి గారు, రెండో అదనపు జిల్లా జడ్జ్ శ్రీ పిపి కృష్ణార్జున గారు, మూడో అదనపు జిల్లా జడ్జి శ్రీమతి సునీత రవీంద్రారెడ్డి గారు, నాలుగో అదనపు జిల్లా జడ్జి శ్రీమతి లావణ్య గారు, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి శ్రీ DVR తేజో కార్తీక్ గారు, అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి దీప్తి గారు, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి అనిత గారు, జూనియర్ సివిల్ జడ్జ్ మొబైల్ కోర్ట్ శ్రీమతి టీ దుర్గా రాణి గారు, బారాసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి గారు, న్యాయవాదులు కోర్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భావి ఛాంపియన్లకు బాటలు వేసిన సమ్మర్ క్యాంప్స్

* **మరిన్ని వినూత్న క్రీడా కార్యక్రమాలతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ**
* **స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి**
* **గచ్చిబౌలి స్టేడియంలో ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు**





అంబర్ పేట, జూన్ 4 (సమయం న్యూస్) : తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు 2025 అద్భుతమైన స్పందన లభించిందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. ఈరోజు గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన వేసవి శిక్షణ శిబిరాల ముగింపు ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరై స్పోర్ట్స్ అథారిటీ వేసవి శిక్షణ శిబిరాలకు ఈ సంవత్సరం అనూహ్య స్పందన లభించిందని భావి ఛాంపియన్లకు బాటలు వేసే విధంగా సమ్మర్ క్యాంప్స్ నిర్వహణ జరిగిందని ఆయన అన్నారు. గత సంవత్సరం కన్నా ఈసారి వేసవి శిక్షణ శిబిరాలలో రెట్టింపు సంఖ్యలో క్రీడాకారులు హాజరైనరని ఆయన తెలిపారు. పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు ఉచిత యోగ జుంబా డాన్స్ ఏర్పాటు చేయడంతో ప్రతి రోజు ఈ శిబిరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారని ఆయన తెలిపారు. గత రేవంత్ రెడ్డి గారు ప్రభుత్వం చేపట్టిన నాటి నుంచి క్రీడారంగానికి ఇస్తున్న అధిక ప్రాధాన్యతతో క్రీడారంగం పట్ల ప్రజలు విశేషంగా ఆసక్తి చూపిస్తున్నారని ఆయన అన్నారు. ఆరోగ్య తెలంగాణ సాధనకు క్రీడలే ప్రధానమని, విద్యార్థులు యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా వారిని సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఆలోచనలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. క్రీడల బడ్జెట్ పెంచడమే కాకుండా వివిధ క్రీడా కార్యక్రమాల రూపకల్పన చేస్తున్న స్పోర్ట్స్ అథారిటీ మరిన్ని వినూత్నమైన కార్యక్రమాలతో తెలంగాణ క్రీడా సమాజానికి చేరువ అయ్యేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్.వి.ఆర్ చైర్మన్ మూలా వెంకటేశ్వర్ గౌడ్, గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కే.మధు, కోర్సులు సిబ్బంది క్రీడాకారులు

# భూసమస్యల పరిష్కారానికి భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులు

: **జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.**



నిర్మల్ జూన్05 (సమయం న్యూస్) : ప్రజల భూ సంబంధిత సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. గురువారం మామడ మండలంలోని ఆరేపల్లి గ్రామంలో నిర్వహించిన భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని రూపొందించి అమలులోకి తెచ్చిందని తెలిపారు. కుంటాల మండలంలో ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద సదస్సులు విజయవంతంగా నిర్వహించామని, ఇప్పుడు రెండో విడత భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులు ఈనెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో నిర్వర్తించబోతున్నామని చెప్పారు. గ్రామ రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు తమ భూ సమస్యలపై దరఖాస్తులు సమర్పించి పరిష్కారం పొందవచ్చని తెలిపారు. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను అధికారులు సక్రమంగా రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, తహసిల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది,



# మున్సిపల్ వార్డుల విభజనకు అఖిలపక్ష సమావేశం నిర్వహించండి

* **బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**

గుమ్మడిదల ,జూన్ 5 , సమయం న్యూస్ : గుమ్మడిదల మున్సిపాలిటీలోని బొంతపల్లి, వీరన్న గూడెం, దోమ డుగు ,అన్నారం గ్రామాలను కలుపుకొని ఇటీవల గుమ్మడిదల మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో వార్డుల విభజన సక్రమంగా జరగలేదని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు కుమార్ గౌడ్ తో కలిసి గురువారం మున్సిపల్ కమిషనర్ రఘుకు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల పరంగా సరైన వార్డ్ ల విభజన జరగకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రతి గ్రామానికి సంబంధించిన వార్డులను వరుస పద్ధతిలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వార్డు విభజనపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కమిషనర్ను కోరారు .ఈ కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, దేవేందర్ రెడ్డి, సత్యనారాయణ, సూర్యనారాయణ, ఆంజనేయులు యాదవ్, మల్లేష్ ,రఘుగౌడ్, పెంటయ్య ,తదితరులు పాల్గొన్నారు.

# బడిబాటలో సమాజ భాగస్వామ్యం అవసరం

* **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

మెదక్, జూన్05 ( సమయం న్యూస్) : సమాజ భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం బడిబాట కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని వీడియో సమావేశ హాల్లో బడిబాట కార్యక్రమం పై నిర్వహణ పై రివ్యూ కలెక్టర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రేపు బడిబాట కార్యక్రమం పై పంచాయతీ సెక్రెటరీ, ఉపాధ్యాయుల సమన్వయంతో గ్రామసభలు నిర్వహించి తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్య ప్రాముఖ్యత పై అవగాహన కల్పించాలని, అలాగే అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు ప్రజా ప్రతినిధులు ఈ గ్రామసభలో పాలు పంచుకునేలా చూడాలన్నారు. ప్రతి, బాల, బాలికలు పాఠశాలలో అడ్మిషన్ పొందేలా ప్రత్యేక శ్రద్ధతో బడి బాట నిర్వహించాలని, *జూన్ 6 నుంచి జూన్ 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. పాఠశాలల్లో బాల బాలికల విద్యార్థినుల డ్రాప్ ఔట్ నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న బడిబాట కార్యక్రమంలో పాఠశాలలో బాలికల నమోదు శాతం పెంపొందించడం పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని ప్రభుత్వ సంక్షేమ పాఠశాలల్లో మరుగుదొడ్లు వినియోగంలో ఉండాలి బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ప్రతి ఇంటిని సందర్శించి పిల్లలంతా తప్పనిసరిగా పాఠశాలల్లో విద్యార్థులుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఇంటింటి సర్వే చేపట్టి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలికలు ఎక్కడ డ్రాప్ ఔట్ కాకుండా చూడాలని, మహిళా శిశు సంక్షేమ



శాఖ అధికారులు సైతం బడిబాట కార్యక్రమంలో పాల్గొంటూ బాలికలు ఎక్కడ విద్యకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట బాలికల బాలికలు పదవ తరగతి ముగిసిన తర్వాత కూడా ఇంటర్ చదివేల వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి మండల సూపర్వైజర్ వారి పరిధిలో గల బాలికల పై శ్రద్ధ వహిస్తూ వారు చదువు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు పట్టణాలలో వార్డు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడ బాల కార్మికులు తప్పకుండా చర్యలు తీసుకోవాలని, పిల్లలంతా తప్పనిసరిగా పాఠశాలలో నమోదు కావాలని అన్నారు. జూన్ 8 నుంచి జూన్ 10 వరకు 3 రోజులపాటు ఇంటింటికి తిరిగి పిల్లలందరూ పాఠశాలలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలు సేకరించి ప్రతి గ్రామంలో గ్రామ రిజిస్టర్లు నమోదు చేయాలని అధికారులకు సూచించారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక



# ఉప ముఖ్యమంత్రి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

* **ఈ నెల 6 న ముసాపేట నవాబు పేట లో ఉప ముఖ్యమంత్రి పర్యటన**

మహబూబ్ నగర్ జూన్ 05( సమయం న్యూస్) : జిల్లాలో నేడు దేవరకద్ర నియోజకవర్గం మూసా పేట,జడ్చర్ల నియోజకవర్గం నవాబ్ పేట మండలం లలో విద్యుత్ సబ్ స్టేషన్ ల నిర్మాణం కు శంఖు స్థాపన,పబ్లిక్ మీటింగ్ కార్యక్రమాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శంకుస్థాపన,పబ్లిక్ మీటింగ్ కార్యక్రమాల్లో పాల్గొంటారని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. గురువారం మూసా పేట మండలం లో జిల్లా కలెక్టర్ పర్యటించి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శుక్రవారం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నేడు ఉదయం 9 గంటలకు ప్రజా భవన్ బేగం పేట,హైద్రాబాద్ నుండి బయలు దేరి మూసా పేట మండలం కు ఉదయం 11 గంటలకు చేరుకుని అధికారులు, అనధికారులను కలుసు కుంటారని,ఉదయం 11.10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 132/33 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్,మండలం లో వివిధ గ్రామాల్లో ఏర్పాటు కానున్న ( 12 ) 33/11 కె.వి సబ్ స్టేషన్ లకు మండల కేంద్రం లో శంకు స్థాపన చేస్తారని అన్నారు. మధ్యాహ్నం 12 నుండి 1 గంట వరకు పబ్లిక్ మీటింగ్ లో పాల్గొంటారని అన్నారు . తర్వాత 2 గంటలకు మూసా పేట నుండి బయలు దేరి మధ్యాహ్నం 3 గంటలకు నవాబ్ పేట మండలం కు చేరుకుంటారని అన్నారు.మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 4.15 గంటల వరకు 132/33 కె. వి సబ్ స్టేషన్,మండలంలో వివిధ గ్రామాల్లో ఏర్పాటు కానున్న (16)33/11 కె. వి సబ్ స్టేషన్ లకు మండల కేంద్రంలో శంఖు స్థాపన చేస్తారని,సాయంత్రం 4.15 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పబ్లిక్ మీటింగ్ లో పాల్గొని అనంతరం హైద్రాబాద్ బయలు దేరుతారని తెలిపారు. పబ్లిక్ మీటింగ్ లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు,కుట్టు మిషన్ లు పంపిణీ,విత్తన కిట్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మూసా పేట మండలం లో ఉప ముఖ్య మంత్రి పర్యటన కు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సబ్ స్టేషన్ ల శంఖు స్థాపన కు ఏర్పాట్లు పరిశీలించారు.పబ్లిక్ మీటింగ్ వేదిక,ప్రజలకు త్రాగు నీరు,వైద్య శాఖ ద్వారా హెల్త్ క్యాంప్,అగ్ని మాపక శాఖ ద్వారా అగ్ని మాపక వాహనం,పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎస్.పి.డి.సి.ఎల్ ఎస్. ఈ.రమేష్,తహశీల్దార్ రాజు తదితరులు పాల్గొన్నారు



## భూభారతి సదస్సులను సద్వినియోగం చేసుకోండి

* **జిన్నారం తహసీల్దార్ దేవాదాసు**

జిన్నారం, జూన్ 5 , సమయం న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిన్నారం తహసిల్దార్ దేవదాసు పిలుపునిచ్చారు . గురువారం వావిలాల, జంగంపేట్ గ్రామాలలో జరిగిన రెవెన్యూ సదస్సులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూపరమైన ఏ సమస్యలు ఉన్న భూభారతిలో తమ వినతులను సమర్పించాలని కోరారు. వావిలాల గ్రామంలో 52 వినతులు, జంగంపేట్ గ్రామంలో 19 వినతులు అందాయని వారు పేర్కొన్నారు. వీటిలో పరిధిలను బట్టి అతి త్వరలో రైతుల సమస్యలు పరిష్కారం చేస్తామని వారు తెలిపారు.

# నిరుపేదలకు నిలువ నీడ ఇవ్వడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

* **మెదక్ ఎమ్మెల్యే మైనం పల్లీ రోహిత్ రావు**

మెదక్ జూన్ 05( సమయం న్యూస్): నిరుపేదలకు అండగా నిలబడి, వారికి నిలువ నీడ ఇవ్వాలన్న ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టిందని మెదక్ నియోజకవర్గ శాసన సభ్యులు మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, హౌసింగ్ పీడీ మాణిక్యం, డిపిఓ యాదయ్య, అన్ని మండలాల ఎంపీడీవోలు పంచాయతీ సెక్రెటరీ, ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారులతోకలిసి మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులందరికి నిలువ నీడను కల్పించాలని గొప్ప



ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రవేశపెట్టిందన్నారు. దశలవారీగా లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతా యన్నారు.ఈ పథకంలో భాగంగా నిరుపేదలైన అర్హులకే ఇళ్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు అనుగుణంగా ప్రతి మండలంలోని ఒక గ్రామం చొప్పున గత జనవరి 26న ప్రభుత్వం ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిందన్నారు. *మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం *కాంగ్రెస్ ప్రభుత్వమని శాసనసభ్యులుగా గెలిచి 14 నెలల్లోనే నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందించామన్నారు. నియోజకవర్గంలో విద్యా వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ క్షేత్రస్థాయిలో సదుపాయాలు కల్పిస్తూ ప్రజలలో మమేకమై పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల సొంతింటి కల ఆశయాన్ని సాకారం చేసేందుకు గాను ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం తీసుకొచ్చిందని ఇల్లు నిర్మించుకునే వారు ఇంటి నిర్మాణ సామాగ్రిని ఒకేసారి కొనుగోలు చేస్తే ఖర్చు తగ్గించుకోవచ్చు అన్నారు. మేస్త్రీలను కూడా స్థానికంగా ఆయా గ్రామంలో ఉన్నవారినే ఎంపిక చేసుకుంటే ఖర్చు తగ్గించుకోవచ్చని తెలియజేశారు. అదేవిధంగా ఇంటి నిర్మాణంలో కావలసిన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నందున ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారులు ప్రొసిడింగ్ పత్రం పొందినవారు వెంటనే పంచాయతీ సెక్రెటరీ సంప్రదించి మార్కింగ్ ముగ్గు పోసుకొని బేస్మెంట్ ప్రారంభించాలన్నారు. బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం పూర్తయితే లక్ష రూపాయలు, రూఫ్ లెవల్ స్థాయి దాటిన తర్వాత లక్ష రూపాయలు, స్లాబ్ పూర్తయ్యాక రూ. 2 లక్షలు, మొత్తం పనులు పూర్తయ్యాక మిగిలిన లక్ష రూపాయలతో కలిపి ఇలా మొత్తం రూ. 5 లక్షలను ప్రభుత్వం లబ్ధిదారులకు చెల్లిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత మండలాల ఎంపీడీవోలు పంచాయతీ సెక్రటరీలు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతి

- **యం పి రఘునందన్ రావుకు వినతి పత్రం**
- **దండే రమాకాంత్ ప్రముఖ న్యాయవాది**

జిన్నారం, జూన్ 5 , సమయం న్యూస్ : కాజిపల్లి గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావుకు గురువారం ప్రముఖ న్యాయవాది , ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్ గ్రామస్తులతో కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాజిపల్లి గ్రామంలో పెద్దమ్మ ఆలయం నుండి నరసింహస్వామి ఆలయం వరకు రోడ్డు మంజూరు చేయాలని, తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నందున పాత మంజీరా లైన్ ను పునరుద్ధరించాలని, పోస్ట్ ఆఫీస్ ను ఏర్పాటు చేయించాలని, గండి చెరువులో వ్యర్థాలు ,డ్రైనేజీ నీరు కలవడంతో గ్రామస్తులు, రైతుల ఆరోగ్య రీత్యా గండి చెరువు ఎఫ్ఆర్ఎల్ ను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని వారు విన్నవించారు. ఇట్టి సమస్యలు విన్న ఎంపీ రఘునందన్ రావు సానుకూలంగా స్పందించి సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తానని తెలిపినట్లు దండే రమాకాంత్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సత్యనారాయణ, ఆకుల నవీన్ ,నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆకస్మికంగా రెవెన్యూ సదస్సును పరిశీలించిన జిల్లా కలెక్టర్

బోధన్ డివిజన్, జూన్ 5, సమయం న్యూస్ : రెవెన్యూ సమస్యల పరిష్కారాన్ని లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల కార్యక్రమం కొనసాగుతోంది. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం సాలూర మండల కేంద్రంను, రుద్రూర్ మండలంలోని రణంపల్లి గ్రామంను ఆకస్మికంగా సందర్శించారు. కలెక్టర్ తో పాటు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఈ పర్యటనలో పాల్గొన్నారు. గ్రామస్థులతో ప్రత్యక్షంగా సమావేశమైన కలెక్టర్, వారి భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూముల మ్యూటేషన్, పట్టాదార్



పాస్‌బుక్‌ల జారీ, వివాదాస్పద భూముల పరిష్కారాలపై ఫిర్యాదులు స్వీకరించి పరిష్కార చర్యలు చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పురోగతిని సమీక్షించి అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. అర్జీదారులకు దరఖాస్తుల రశీదులు ఇవ్వడం తప్పనిసరి అని, సంబంధిత వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దరఖాస్తుదారుల సమస్యలపై స్పష్టమైన నివేదికలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేలా సదస్సులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 20 వరకు రెవెన్యూ సదస్సులు కొనసాగుతాయని తెలిపారు. గ్రామస్థులు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ, నిర్మాణ పనులకు శ్రీకారం

బోధన్ పట్టణం, జూన్ 5, సమయం న్యూస్ : బోధన్ పట్టణంలోని 18వ వార్డు శ్రీనివాస కాలనీలో లబ్దిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మంగళవారం భూమిపూజ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా లబ్దిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలు అందజేశారు. పట్టణంలోని 13, 22, 3, 4, 6వ వార్డులలోనూ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు లబ్దిదారులతో కలిసి భూమిపూజలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ నాయకులు ప్రజలతో కలిసి కార్యాచరణను చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పాషా మొయినుద్దీన్, సీనియర్ నాయకులు తూము శరత్ రెడ్డి, హరికాంత్ చారి, 18వ వార్డు ఇంచార్జ్ చిత్రాల ప్రమోద్ కుమార్ (చిన్ను), రమణ, నరసరాజు, నాగ మురళి, సతీష్, సాకేత్, బద్దరావు, వెంకట్, బాబు, బాపయ్య, వార్డు అధికారి మాధారి సాయిలు తదితరులు పాల్గొన్నారు. ఇండ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని నేతలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

* **జూన్ 6నాటికి ఇండ్ల నిర్మాణాలు ప్రారంభం కావాలి**
* **హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

హనుమకొండ జూన్ ,05( సమయం న్యూస్)జిల్లాలో లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతంగా చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్లు, లబ్ధిదారుల ఎంపిక, పొజిషన్ సర్టిఫికెట్లు, రెవెన్యూ సదస్సులు, రాజీవ్ యువ వికాసం, టూబీహెచ్కె ఇళ్ళు, తదితర అంశాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ యువ వికాసం పథకంపై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించి గృహ నిర్మాణ శాఖ డిఈ



సిద్ధార్థ నాయక్, ఆయా మండలాలలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతికి సంబంధించిన వివరాలను ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకంలో మొదటి దశలో రూ. 50 వేలు, రూ.లక్ష లోపు రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికను జూన్ 9 నాటికి పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మండల స్థాయిలో పూర్తి చేసిన తర్వాత ఆ జాబితాను సబ్సిడీ రుణాల మంజూరు నిమిత్తం జిల్లా ఇన్చార్జి మంత్రి కి సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించి పైలెట్ గ్రామాలలో ప్రారంభమైన ఇండ్ల నిర్మాణాల పనులను వేగంగా పూర్తయ్యేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపికను అధికారులు పూర్తి చేయాలన్నారు. జూన్ రెండవ తేదీన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి నియోజకవర్గానికి సంబంధించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ప్రొసీడింగ్ పత్రాలు ఎమ్మెల్యేల చేతుల మీదుగా అందజేస్తారని, లబ్ధిదారులు వెంటనే ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జూన్ 6 నాటికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభం కావాలన్నారు. జూన్ 9 నాటికి 100% నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ఎంపీడీవోలు ఇందిరమ్మ ఇండ్లు పథకానికి అదనంగా బఫర్ లిస్టు సిద్ధం చేయాలన్నారు. జూన్ 6 తేదీ నాటికి పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిర్మాణాలకు ముగ్గులు పోసి ప్రారంభించకపోతే తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవోలు పంచాయతీ కార్యదర్శులు ఏఈలు సమన్వయంతో లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జూన్ చివరి నాటికి ఇండ్లు నిర్మాణం పూర్తి చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా జిల్లాలో పైలట్ మండలంగా ఎంపికైన నడికూడ మండలంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, నడికూడ తహసీల్దార్ రవీందర్ రెడ్డి ని ఆదేశించారు. దరఖాస్తుల విచారణ ప్రక్రియ ను ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు.

# 'ట్రావెల్ బ్యాగు'లో మహిళ మృతదేహం.. నిందితుడిని గుర్తించిన పోలీసులు

హైదరాబాద్: నగర శివారులోని బాచుపల్లిలో ట్రావెల్ బ్యాగులో మహిళ మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు.. మృతదేహాన్ని నేపాల్‌కు చెందిన యువతిగా గుర్తించారు. నేపాల్‌కు చెందిన విజయ్ అనే వ్యక్తి మే 23న యువతిని హత్య చేసి మృతదేహాన్ని ట్రావెల్ బ్యాగ్‌లో పెట్టి బాచుపల్లిమియాపూర్ రహదారి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో పడేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. కేపీహెచ్‌బీలో నిందితుడు సూట్ కేస్ కొనుగోలు చేసినట్టు పోలీసులు ఆధారాలు సేకరించారు.

**ఏం జరిగిందంటే?**

హైదరాబాద్ శివారులోని బాచుపల్లి మియాపూర్ రహదారి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో బుధవారం ఉదయం ట్రావెల్ బ్యాగులో మహిళ మృతదేహం కలకలం రేపింది. బాచుపల్లి రెడ్డీస్ ల్యాబొరేటరీస్ కంపెనీ పక్కన విజయదుర్గా ఓనర్స్ అసోసియేషన్ కాలనీ లేఅవుట్ ఉంది. అందులో నివాసాలు లేకపోవడంతో ఆ ప్రాంతమంతా నిర్మానుష్యంగా ఉంటుంది. ఇక్కడ రెండు రోజులుగా దుర్వాసన వస్తుండటాన్ని వాహనదారులు గుర్తించారు.




బుధవారం సమస్య మరింత పెరగడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి పెద్ద ట్రావెల్ బ్యాగును తెరిచి చూడగా 2535 ఏళ్ల మధ్య వయసున్న మహిళ మృతదేహం కనిపించింది. మెడలో మంచానికి ఉపయోగించే నవారు ఉండటాన్ని గమనించి ఆమెను హత్య చేసి ఉంటారని, ఎక్కడో వేరే ప్రదేశంలో హతమార్చి ఇక్కడికి తీసుకొచ్చి పడేసి ఉంటారని భావించారు. ఒంటిపై ఎరుపు రంగు పంజాబీ దుస్తులు, చేతికి మట్టి గాజులు ఉన్నాయి. మృతదేహం తీరును బట్టి వారం నుంచి పది రోజుల క్రితం చనిపోయినట్లు నిర్ధారించారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం సృష్టించడంతో పోలీసులు నాలుగు బృందాలతో దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు.

## పెళ్లి బృందం కారును ఢీకొట్టిన డీసీఎం వాహనం.. చిన్నారి మృతి, వరుడికి గాయాలు

కొండగట్టు: జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద బుధవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లి బృందం కారును డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 3 నెలల చిన్నారి రుద్ర మృతిచెందగా.. వరుడు సహా ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. బుధవారం రాత్రి నాందేడ్ నుంచి హుజూరాబాద్‌కు పెళ్లి బృందం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వరుడు గాయపడటంతో వివాహం ఆగిపోయింది. గాయపడిన వారు చికిత్స అనంతరం తిరిగి నాందేడ్ వెళ్లిపోయారు.



**గాయపడిన వారు**

మహేశ్ (వరుడు), వాగ్మేర సితాల్, వాగ్మేర మారుబాయి, వాగ్మేర దినేశ్, వాగ్మేర సోనాలి, డ్రైవర్ గణేశ్

# ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతిపై చర్చ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో కేబినెట్ సమావేశం కొనసాగుతోంది. రాజీవ్ యువ వికాసం, వానాకాలం పంటలు, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతిపై కేబినెట్‌లో ప్రధానంగా చర్చిస్తున్నారు. కాళేశ్వరం కమిషన్ విచారణపై కూడా చర్చ చేస్తున్నట్లు సమాచారం. ఉద్యోగుల సమస్యలపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఉద్యోగులు సమస్యలు, రైతు భరోసా స్కీమ్ నిధుల విడుదల తేదీపై క్లారిటీ, బనకచర్ల ప్రాజెక్ట్ అంశంపై చర్చ చేస్తున్నట్లు తెలుస్తోంది. అలానే పెండింగ్ డీఏ విడుదల అంశంలో కూడా క్లారిటీ వచ్చే అవకాశం ఇచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటికే బుధవారం నాడు రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ఉద్యోగ



సంఘాలు భేటీ అయ్యాయి. ఈ సమావేశంలో వారు అనేక అంశాలపై చర్చించారు. దీంతో నేటి కేబినెట్ భేటీ తర్వాత ఉద్యోగులకు సంబంధించి ఒకటి లేదా రెండు పెండింగ్ డీఏలపై ప్రకటన ఉంటుందని భావిస్తున్నారు. వీటితో పాటుగా విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలు, భూభారతి చట్టం అమలు, భూదాన్ భూముల వ్యవహారంతో పాటు పలు పెండింగ్ ప్రాజెక్టుల గురించి కేబినెట్ భేటీలో చర్చ చేస్తున్నట్లు సమాచారం.





## హైదరాబాద్ వాసులకు అలర్ట్.. మళ్లీ షురూ అయిన వర్షం

హైదరాబాద్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఎండ మండిపోగా.. సాయంత్రానికి వాతావరణం చల్లబడింది. నగర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షం మొదలైంది. నిజాంపేట్, KPHB, మియాపూర్, బాలానగర్, చింతల్, బోయిన్‌పల్లి, ప్రగతినగర్ ఏరియాల్లో వర్షం పడుతోంది. కొన్ని గంటల్లో మరికొన్ని ప్రాంతాలకు ఈ వర్షం విస్తరించే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షం కారణంగా రోడ్లపైకి వరదనీరు చేరింది. దీంతో అక్కడక్కడ భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు, హైడ్రా, జీహెచ్ఎంసీ బృందాలు రంగంలోకి దిగాయి.

## కాళేశ్వరం కమిషన్ ముందుకు
# కేసీఆర్, ఈటల రాజేందర్, హరీష్ రావు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు, అవినీతి ఆరోపణలపై జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, డిజైన్, నాణ్యత నియంత్రణ, ఆర్థిక వ్యవహారాలపై కమిషన్ దృష్టి సారించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మితమైన ఈ ప్రాజెక్టు సమయంలో మాజీ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, మాజీ నీటిపారుదల మంత్రి హరీష్ రావులు కీలక పాత్రలు పోషించారు. వీరి ఇద్దరితో పాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కూడా కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈటల రాజేందర్ జూన్ 6న, హరీష్ రావు జూన్ 9న, కేసీఆర్ జూన్ 11న విచారణకు హాజరు కావాలని కమిషన్ ఆదేశించింది. కమిషన్ ఇప్పటికే 200 మంది అధికారులను, 25 మంది ఐఏఎస్ అధికారులను విచారించి... బ్యారేజీల నిర్మాణ సంస్థలు, ఇంజనీర్లు, కాగ్, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలను పరిశీలించింది. అధికారులు తమ వాంగ్మూలంలో కేసీఆర్ ఆదేశాల మేరకు నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. దీంతో వీరి ముగ్గురి వాదనలు కూడా పరిగణలోకి తీసుకోవడానికి కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ విచారణలో బీఆర్ఎస్ నేతల వాంగ్మూలాలు రాజకీయంగా కీలకం కానున్నాయి, జూన్ 30 నాటికి కమిషన్ తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## డీఈఈ సెట్ ఫలితాలు విడుదల

డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రవేశాల కోసం నిర్వహించిన డీఈఈ సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ప్రవేశ పరీక్షకు 33,321 మంది హాజరయ్యారు. తాజాగా విడుదలైన ఫలితాల ప్రకారం, 28,448 మంది క్వాలిఫై అయ్యారు. ఈ నేపథ్యంలో ఈ నెల (జూన్) 9 నుంచి 13 వరకు రాష్ట్రంలోని 10 డైట్ కాలేజీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు. జూన్ 14 నుంచి 17 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకువచ్చు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 50కి పైగా డైట్ కాలేజీల్లో 4000 వరకు సీట్లు అందుబాటులో ఉన్నట్లు సమాచారం. ఫలితాల కోసం ఈ లింక్ https://deecet.cdse.telangana.gov.in/ పై క్లిక్ చేయండి.

# యుద్ధ ట్యాంకులో రక్షణ మంత్రి రైడ్..

మెదక్ జిల్లాకే తలమానికంగా నిలిచిన (ఓడిఎఫ్) ఆయుధ కర్మాగారానికి తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ అన్నారు. గురువారం ఆయన కంది మండల పరిధిలోని ఎద్దుమైలారం ఓడిఎఫ్ కర్మాగారంలో స్థానిక మెదక్ ఎంపీ రఘునందన్ రావు తో కలిసి పర్యటించారు. అందులో తయారు చేస్తున్న యుద్ధ ట్యాంకులో ఎక్కి తిరిగి వాటి పనితీరును పరిశీలించారు. అనంతరం మేనేజ్మెంట్ సిబ్బందితో కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఓడిఎఫ్ చేస్తున్న సేవలు గొప్పవని ప్రశంసించారు. దేశానికి ఇలాంటి కర్మగారాల సేవలు ఎంతో అవసరమని, అందుకు




అవసరమైన తమ సంపూర్ణమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషిచేస్తానని ఈ సందర్భంగా సిబ్బందికి భరోసానిచ్చారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని కర్మాగారం ఆవరణలో మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఎండీ సంజయ్ దివేది, జనరల్ మేనేజర్ ఎస్.ఎస్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ధన్వాడ రైతులపై ప్రభుత్వ దౌర్జన్యం దారుణం: మాజీ మంత్రి

జోగులాంబ గద్వాల జిల్లా పెద్దధన్వాడలో రైతులపై ప్రభుత్వ దౌర్జన్యం దారుణమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇథనాల్ పరిశ్రమ స్థాపించమబోమని రైతులకు హామీ ఇచ్చి.. మళ్లీ అక్కడ పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నించడం రైతులను, ప్రజలను మోసం చేయడమే అని తెలిపారు. ప్రభుత్వ మోసాన్ని ప్రశ్నించిన రైతులు, రైతు కుటుంబాలపై పోలీసులు లాఠీచార్జి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. అంతేకాకుండా.. 40 మంది రైతులను అదుపులోకి తీసుకుని.. 12 మందిపై కేసులు పెట్టి రిమాండుకు పంపడం దుర్మార్గమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్జన్యాలను ఎదిరిస్తామని.. భవిష్యత్తులో కాంగ్రెస్ కుటిల నీతికి ప్రజలే



గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుక.. మన పత్రిక తెలుగు దినపత్రిక



## వేడుకల కంటే ప్రాణాలు ముఖ్యం.. బెంగళూరు తొక్కిసలాట ఘటనపై కపిల్‌దేవ్ ఆవేదన



బెంగళూరులో జరిగిన తొక్కిసలాట ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఘటనపై ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. తాజాగా స్పందించిన భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వేడుకల కంటే ప్రాణాలు ముఖ్యమని పేర్కొన్నారు. ''ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో అభిమానులు ప్రాణాలు కోల్పోయారనే వార్త ఎంతో బాధ కలిగించింది. ఇలాంటి ఘటనలు జరగకూడదని కోరుకుంటున్నా. ఈ ఘటన తర్వాత మనం మరో విషయం తెలుసుకోవాలి. మరోసారి ఇలాంటి కార్యక్రమాలు జరిగినప్పుడు ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. గొప్ప క్షణాలను వేడుకగా చేసుకునే సమయంలో పెద్ద ప్రమాదాలకు దారి తీయకుండా జాగ్రత్త వహించాలి. భవిష్యత్తులో ఏదైనా జట్టు గెలిస్తే ప్రశాంతంగా సంబరాలు చేసుకోవాలి. వేడుకల కంటే జీవితాలు చాలా ముఖ్యమైనవి. ఇకపై జాగ్రత్తగా ఉందాం'' అని ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. బెంగళూరు తొక్కిసలాటలో మొత్తం 11 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత బెంగళూరు జట్టు ఐపీఎల్ కప్‌ను సొంతం చేసుకోవడంతో చిన్నస్వామి స్టేడియానికి అభిమానులు పోటెత్తారు. అంచనాలకు మించి జనం రావడంతో వారిని నియంత్రించడం పోలీసుల వల్ల కాలేదు. అదే సమయంలో వర్షం కురవడంతో తొక్కిసలాట మొదలై పలువురు మృత్యువాత పడినట్లు పోలీసులు తెలిపారు.

## 'కోహ్లీ నిరీక్షణ 18 ఏళ్లే.. సచిన్ అంతకంటే ఎక్కువ కాలం వేచి ఉన్నాడు'



ఐపీఎల్‌లో ఆర్సీబీ ఎట్టకేలకు తొలి టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఐపీఎల్ 2025లో ఆర్సీబీ ఛాంపియన్‌గా అవతరించింది. దీంతో ఆ జట్టుతోపాటు విరాట్ కోహ్లీకి ఐపీఎల్ టైటిల్ కల సాకారమైంది. ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ ఓ విషయాన్ని గుర్తు చేసుకున్నాడు. కోహ్లీ ఐపీఎల్ టైటిల్ కోసం 18 ఏళ్లు నిరీక్షిస్తే.. సచిన్ తెందూల్కర్ వన్డే ప్రపంచ కప్ కలను సాకారం చేసుకోవడానికి అంతకంటే ఎక్కువ కాలం వేచి చూశాడని సెహ్వాగ్ పేర్కొన్నాడు. 2011 ప్రపంచకప్‌తో సచిన్ ప్రపంచ కప్ కల నెరవేరిన సంగతి తెలిసిందే. 'ఐపీఎల్ ట్రోఫీని గెలవడానికి కోహ్లీ కేవలం 18 సంవత్సరాలు వేచి చూశాడు. వన్డే ప్రపంచ కప్ కలను సాకారం చేసుకోవడానికి సచిన్ తెందూల్కర్ 1989 నుంచి 2011 వరకు వేచి ఉన్నాడు. దీన్ని బట్టి చూస్తే కోహ్లీ నిరీక్షించింది తక్కువ కాలమే. ప్రపంచ కప్ కోసం సుదీర్ఘకాలం వేచి చూసిన సచిన్ ఎప్పుడూ ఆశను కోల్పోలేదు. చివరకు వరల్డ్ కప్ సాధించాలనే కోరికను నెరవేర్చుకున్నాడు. విరాట్ కోహ్లీ కూడా అంతే. ఇప్పుడు అతను ఉపశమనం పొందవచ్చు. ఐపీఎల్‌కు రిటైర్మెంట్ తీసుకోవాలనుకున్నప్పుడు ఎలాంటి విచారం లేకుండా సంతోషంగా ఆ నిర్ణయం తీసుకోవచ్చు. ఏ ఆటగాడైనా ట్రోఫీని గెలవడం కోసం ఆడతాడు. డబ్బు వస్తుంటుంది.. పోతుంటుంది. కానీ, ట్రోఫీలు గెలవడం అంత సులభం కాదు' అని సెహ్వాగ్ వివరించాడు.

## సినిమా ఫ్లాప్ అయితే నటీనటులపై నిందలు

: రీతూవర్మ



హైదరాబాద్: రీతూ వర్మ ప్రధాన పాత్రలో నటించిన సరికొత్త వెబ్ సిరీస్ 'దేవిక అండ్ డానీ'. రొమాంటిక్ థ్రిల్లర్ నేపథ్యంలో ఇది తెరకెక్కింది. జూన్ 6 నుంచి జియో హాట్ స్టార్ వేదికగా ఇది స్ట్రీమింగ్ కానుంది. ఈ సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రీతూవర్మ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏదైనా ప్రాజెక్ట్ బాక్సాఫీస్ వద్ద పరాజయం అందుకుంటే నటీనటులనే నిందిస్తారని ఆమె అన్నారు. అలా చేయడం ఏమాత్రం సరైన పద్ధతి కాదన్నారు. ''నాకు బాక్సాఫీస్ బిజినెస్ గురించి పెద్దగా అవగాహన లేదు. నటించే ప్రతి సినిమా తప్పకుండా విజయం సాధించాలని మనం కోరుకుంటాం. నిర్మాతకు లాభాలు రావాలని ఆశిస్తాం. అలా జరగనప్పుడు తప్పకుండా బాధపడతాం. కెరీర్ ఆరంభంలో ఈ విషయంలో నేనెంతో బాధపడ్డా. కానీ, ఇప్పుడు దాని గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. ఏదైనా ప్రాజెక్ట్ ఫ్లాప్ అయితే.. దాని గురించి ఆలోచించడం మానేసి భవిష్యత్తులో చేయనున్న సినిమాలపై దృష్టి పెడుతున్నా. నా ఫోకస్ మొత్తం యాక్టింగ్‌పైనే ఉంటుంది. ఒక నటిగా విభిన్నమైన పాత్రలు చేయాలనేది నా ఉద్దేశం. అలాగే, సినిమా అనేది అందరికీ సంబంధించిన విషయం. 24 క్రాఫ్ట్స్ కలిస్తేనే సినిమా రూపొందుతుంది. కాబట్టి, ఒక సినిమా ఫ్లాప్ అయితే ఏ ఒక్క వ్యక్తినో నిందించడం ఏమాత్రం కరెక్ట్ కాదు. చాలాసార్లు హీరోహీరోయిన్స్‌ని నిందిస్తుంటారు. గోల్డెన్ లెగ్ లేదా ఐరన్ లెగ్ అని ట్యాగ్స్ ఇస్తుంటారు. ఒకవేళ సినిమా హిట్ అయినా అది అందరి అదృష్టానికి సంబంధించిన విషయం'' అని రీతూవర్మ అన్నారు.



రకుల్ ప్రీత్ సింగ్ దేశీ ఎలిగెన్స్‌ను ఆలింగనం చేసుకుంది అభిమానులు ఆమె ఫ్యాషన్ భావాన్ని ఆస్వాదిస్తున్నప్పటికీ, జాకీ భగ్నానితో ఆమె ప్రేమకథ హృదయాలను గెలుచుకుంటూనే ఉంది.

# సినిమా

## కొంటె చూపులకు 40 యాక్సిడెంట్స్!!



వేదం సినిమా రిలీజై 15 ఏండ్లు పూర్తవుతోంది. ఈ సినిమాలో అనుష్క శెట్టి వేశ్య పాత్రలో నటించారు. ఆమె కెరీర్ లో సూపర్ హిట్ గా నిలిచిపోయిన సినిమాల్లో వేదం ఒకటి. ముఖ్యంగా తన అంద చందాలతో యువతను బాగా ఆకట్టుకుంది. ఈ చిత్రం అనుష్కను స్టార్ గా నిలబెట్టింది. ఈ సందర్భంగా దర్శకుడు క్రిష్ అప్పటి సంఘటనలు కూడా గుర్తు చేసుకున్నారు. అనుష్క ధరించిన పసుపు రంగు చీర స్టిల్స్ ని ప్రమోషన్స్ లో బాగా ఉపయోగించారు. ఆమె చీర కట్టుకొని వెనక్కి తిరిగి చూస్తూ మత్తెక్కించే చూపులతో యువతను బాగా ఆకట్టుకుంది. మూవీ ప్రమోషన్స్ లో భాగంగా హైదరాబాద్ పంజాగుట్ట సర్కిల్ లో అనుష్క వెనక్కి తిరిగి చూస్తున్న ఫోటోని పెద్ద హోర్డింగ్ గా పెట్టారట. అది చూడగానే ఆకట్టుకునేలా ఉండటం, అనుష్క కొత్తలుక్, అందులోనూ మత్తెక్కించే చూపులతో కవ్వించడంతో ఆ హోర్డింగ్ హైలెట్‌గా నిలిచింది. ఆ హోర్డింగ్ లో అనుష్కని చూస్తూ వాహనదారులు చాలామంది యాక్సిడెంట్స్ చేశారట. అలా అని ఒకటి రెండు కాదు ఏకంగా అనుష్క హోర్డింగ్ వల్ల దాదాపు 40 యాక్సిడెంట్ లు అయ్యాయట. దీంతో రెగ్యులర్ గా యాక్సిడెంట్స్ జరుగుతుండటంతో పోలీసులు ఈ హోర్డింగ్ ను జీహెచ్ఎంసీ సిబ్బందితో తొలగింపజేశారట.



## దుబాయ్‌లో సమంత

దుబాయ్ లో స్టార్ హీరోయిన్ సమంత సందడి చేసింది. ఓ జ్యువెలరీ బ్రాండ్ లాంచ్ సందర్భంగా కొత్త ఫొటోలను షేర్ చేసింది. చీరకట్టులో ఆమె మెరిసిపోయింది. ఈ ఫొటోలు సోషల్ మీడియలో తెగ వైరల్ గా మారాయి.ఈ ఫొటోలను తన ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసుకుంది. ఆమె లుక్ నచ్చి చీరకట్టులో ఎంత అందంగా ఉందో అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. సమంత అందమైన ఎంబ్రాయిడరీ వర్క్ తో ఉన్న లేత పసుపు రంగు చీరలో కనిపించింది. లుక్ కోసం లేస్ డిజైన్ తో సరిపోయే పసుపు రంగు బ్లౌజ్ ను జత చేసి, జుట్టును విప్పి ఎడమ వైపుకు విడదీసింది. ఓ ఫొటోలో హోటల్ గది బాల్కనీలో సమంత ఆమె ఫోజులిచ్చింది. మరో ఫొటోలో జ్యువెలరీ బ్రాండ్ నుంచి 'సర్టిఫికేట్ ఆఫ్ ప్రజెంటేషన్'గా బహుమతిగా ఇచ్చిన జ్ఞాపికను ఆమె పట్టుకుంది. ఈ ఫొటోలపై స్పందించిన ఓ అభిమాని 'నిన్ను చూసి చాలా గర్వంగా ఉంది సామ్! నువ్వు ఎదగడం చూడటం చాలా ఆనందంగా ఉంది' అని పేర్కొన్నాడు. "ఎప్పటికీ ఫేవరెట్. చాలా క్యూట్ గా ఉంది' అని మరో అభిమాని కామెంట్ చేశాడు. ఇదిలా ఉండగా సమంత ఇటీవలే ట్రాలాల మూవింగ్ పిక్చర్స్ ను ప్రారంభించి నిర్మాతగా మారింది. ఈ బ్యానర్ పై శుభం టైటిల్ తో ఫస్ట్ సినిమాను రిలీజ్ చేసింది.



## పళనిలో సూర్య

తమిళ హీరో సూర్య పళని మురుగన్ ను దర్శించుకున్నారు. ఇటీవల ఆయన నటించిన 'కంగువా', 'రెట్రో' మిశ్రమ స్పందనలకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం ఆయన దృష్టి మొత్తం సూర్య 46 పైనే పెట్టారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఈ సినిమా సిద్ధం కానుంది. పూజా కార్యక్రమాలతో ఇటీవల ఈ సినిమా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇవాళ ఈ చిత్రబృందం పళని మురుగన్ దేవాలయాన్ని సందర్శించింది. ఈ టీంలో సూర్య, వెంకీ అట్లూరి, నాగవంశీ ఉన్నారు. ఇందుకు సంబంధించిన కొన్ని ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. వీటిని చూసిన నెటిజన్లు చిత్రబృందానికి ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. 'లక్కీ భాస్కర్' తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. ఈ మూవీలో మమితా బైజు కథానాయిక.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.